

## పదోన్నతి ఉపాధ్యాయులకు నేటి నుంచి శిక్షణ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పీజీ హెచ్ఎం, భాష పండితులు, ఎల్ఎఫ్ఎల్, తెలుగు, హిందీ, బయోసైన్స్, సోషల్, స్కూల్ అసిస్టెంట్లకు గురు, శుక్రవారాల్లో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డీఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్‌లోని పంచశీల బీఈడీ కాలేజీ, విజయ హైస్కూల్, జుమ్మెరాత్‌పేట్, కస్బా హైస్కూళ్లలో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఫిజికల్ సైన్స్, పీఈటీ, ఇంగ్లీష్, గణితం, స్కూల్ అసిస్టెంట్లకు ఆదిలాబాద్‌లోని డైట్, బాలికల హైస్కూల్‌లో శిక్షణ ఉంటుందన్నారు. ఉర్దూ వారికి హైదరాబాద్ టీజీఐఆర్డీ రాజేంద్రనగర్‌లో ఒక్కరోజు శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



# స్థానిక అవసరాలు తక్కువ
# తరలించడం పైనే మక్కువ

- జిల్లాలో ఇసుక మాఫియా ఆగడాలతో క్షేత్రస్థాయిలో కృత్రిమ కొరత
- కట్టడి చేసేందుకు యత్నించిన అధికారుల కళ్లు కప్పి తరలిస్తున్న కేటుగాళ్లు
- అనుమతులను అడ్డుపెట్టుకుని అక్రమ దందాలకు తెర
- ఇసుక దందాను అడ్డుకునేందుకు వెళ్లిన అధికారులకు బెదిరింపులు
- గత అనుభవాల దృష్ట్యా ఇసుక తరలింపును అడ్డుకునేందుకు వెనుకాడుతున్న అధికారులు
- డంపులు పోసి ఇతర ప్రాంతాలకు తరలించడమే కొంప ముంచుతోందంటున్న స్థానికులు

ఖానాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : విలువైన ప్రకృతి సంపదకు పెట్టింది పేరైన ఖానాపూర్, కడెం ప్రాంతంలో నిర్మాణరంగంలో ఉపయోగించే ఇసుక, మొరం, పునాది రాళ్ల ధరలు చుక్కలనంటుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి వాగుల్లో, ఒర్రెల్లో, అడవుల్లో, ఇతర రెవెన్యూ ప్రదేశాల్లో లభించే ప్రకృతి వనరులను కొంతమంది కేటుగాళ్లు ప్రస్తుతం గుట్టు చప్పుడు కాకుండా లారీలలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దట్టమైన అడవులు ఉన్న ప్రాంతంగా పేరుగాంచిన ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్, ఉడుంపూర్ ప్రాంతాలు కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో ఉన్నాయి. ఈ ప్రాంత అడవులు సకల జీవజాతులకు నిలయమే కాకుండా గలగల పారే సెలయేర్లు, ఖానాపూర్, కడెం మండలాలను ఆనుకుని ప్రవహించే గోదావరి నది లాంటి ఎన్నో తరగని ప్రకృతి వనరులను కలిగి ఉన్నాయి. దీంతో ఇక్కడ ఇనదుల్లో, వాగుల్లో, సెలయేర్లలో ఇబ్బడి ముబ్బడిగా ఇసుక మేటలున్నాయి. గుట్టప్రాంతాల్లో రాళ్లు, నాణ్యమైన మొరం, విలువైన వృక్షసంపద ఈ ప్రాంతం సొంతం. దీంతో ఇక్కడి విలువైన ప్రకృతి సంపదను అక్రమంగా కొల్లగొట్టి కోట్లకు పడగలెత్తడమే లక్ష్యంగా కొంతమంది కేటుగాళ్లు తమ దందాలు సాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యవస్థ లోని లొసుగులను ఉపయోగించుకొని వారు సాగిస్తున్న అక్రమ దందాను సక్రమంగా నిర్వ హిస్తున్నట్లు ప్రపంచానికి కనిపించేలా అన్ని పత్రాలను సృష్టిస్తున్నారని చెబుతున్నారు. ఖానాపూర్, కడెం ప్రాం తాల నుంచి ప్రకృతి వనరులను ఇతర ప్రాంతాలకు తరలిస్తుండడంతో ఈ ప్రాంతంలో నూతనంగా ఇళ్లను, వ్యాపార సముదాయాలను నిర్మాణం చేపడుతున్న సామా న్యులకు, వ్యాపారులకు నిర్మాణ రంగంలో ఉపయోగించే ముడిసరుకులైన ఇసుక, మొరం, పునాదిరాళ్ల లాంటి వాటిని కొనుగోలు చేయాలంటే కత్తి మీద సాములాగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో లభించే ఇసుక, మొరం, పునాది రాళ్ళ లాంటి ప్రకృతి వనరులతో వ్యాపారం చేసే వారు ఈ వనరులను స్థానిక అవసరాలకు తక్కువగా ఉపయోగిస్తూ ఇతర ప్రాంతాలకు తరలించడం పైనే మక్కువ చూపుతుండడంతో స్థానికంగా కృత్రిమ కొరత ఏర్పడినట్లు చెబుతున్నారు.



రెంకోని వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

### అధికధరలతో దండుకునేందుకే కృత్రిమ కొరత

సహజసిద్ధంగా ఖానాపూర్ ప్రాం తంలో లభించే ప్రకృతి వనరులను ఈ ప్రాంతంలో ఉపయోగిస్తే మరో వందేళ్లకైనా తరగని గని లాగా ఇక్కడి ప్రజల అవసరలకు ఉపయోగ పడతాయని చెబుతున్నారు. ప్రకృతి వనరులు ఇసుక, మొరం, పునాదిరాళ్లు ఇలాంటివి ఇబ్బడి ముబ్బడిగా లభిం చే ఖానాపూర్ ప్రాంతంలో కొద్దిరోజుల క్రితం వరకు ఒక ట్రాక్టర్ ట్రిప్పు ఇసుక 1000 రూపాయలకు, మొరం ట్రిప్పు 300లకు, పునాదిరాళ్ళు రూ.1000కి దొరికేవని చెబుతు న్నారు. ఈ ప్రాంతంలో వ్యవసాయ అవసరాలకు ఉప యోగించే ట్రాక్టర్లు తమకు పనిలేని సమయంలో ఇసుక, మొరం, పునాదిరాళ్ళు లాంటివి తెచ్చి స్థానికుల అవసరాలకు తీర్చేవి. సదరు ట్రాక్టర్ల నిర్వాహకులు ఎంత తరలించిన మండల పరిధి దాటి వెళ్లేవారు కాదని చెబుతున్నారు. కానీ గత రెండు మూడేళ్లలో ఖానాపూర్ ప్రాంతంలోని ప్రకృతి వనరులపై దృష్టిపెట్టిన కొంతమంది స్థానిక రేటుగాళ్లు ఈ ప్రాంతంలో లభించే ఇసుక, మొరం ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఎత్తుగడలు సిద్ధం చేసుకున్నారు. అందుకుగాను కొంతమంది ఒక మాఫియా లాగా ఏర్పడి పొద్దంతా ఇసుకను సేకరించి డంపులుగా పోస్తూ రాత్రివేళల్లో లారీలలో, టిప్పర్లలో తరలిస్తున్నట్లు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ట్రాక్టర్ నిర్వాహకులకు కేవలం రూ.1000 చెల్లించి ట్రిప్పును కొనుగోలు చేస్తున్న సదరు మాఫియా లారీలలో తరలించిన ఇసుకను నిర్మల్, భైంసా లాంటి పట్టణాల్లో మూడు నాలుగింతల అదనపు ధరకు విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ఇసుక అవసరమున్నవారు రెట్టింపుధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తలెత్తిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక మొరం సైతం దొరకడం లేదనే కృత్రిమకొరతను సృష్టించి రూ.300లు ఉన్న మొరం ధర నేడు ఏకంగా రూ.1000 నుంచి రూ.1400 పలికే స్థాయికి తెచ్చారని చెబుతున్నారు. ఇలా ప్రకృతి వనరులను ఇతర ప్రాంతాలకు దాటించి క్షేత్రస్థాయిలో కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. దీంతో భవన నిర్మాణ రంగం మరింత ప్రియమైనట్లు స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇతర ప్రాంతాలకు ఇసుక, మొరం లాంటి ప్రకృతి వనరులను తరలిస్తున్న వారికి అడ్డుకట్ట వేయకపోతే రాబోయే రోజుల్లో ఖానాపూర్, కడెం ప్రాంతాల్లో సామాన్యులెవరు ఇళ్ల నిర్మాణాలు చేయలేని పరిస్థితి తలెత్తుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అనుమతులంటూ మభ్యపెడుతూ.. ఆపై భయపెడుతూ..

ఈ ప్రాంత ప్రకృతి వనరులను కొల్లగొట్టేందుకు అనుమతులు పేరిట ఇసుక మాఫియా కొత్త ఎత్తుగడలకు తెరలేపుతున్నారు. కాళేశ్వరం నుండి ఒక్క లారీలో ఇసుక తీసుకువచ్చి అదే వే బిల్లుపై ఖానాపూర్, కడెం ప్రాంతాల నుండి పలుమార్లు ఇసుకను తరలిస్తూ అనుమతులు ఉన్నాయంటూ అధికారులను మభ్యపెడుతున్నారు. కొంత మంది అధికారులతో ముందస్తుగానే ఒప్పందం కుదుర్చుకొని వీరి రాకపోకల వివరాలను వారికి చేరవేస్తూ తమ దందాను సాఫీగా సాగిస్తున్నారు. మరో పక్క క్షేత్రస్థాయిలో ఇసుక డంపులను ఏర్పాటు చేసుకొని వాటిని సీజ్ చేయిం చి వేలంపాటలో దక్కించుకొని ఆ వేలంపాట రసీదులను అడ్డుపెట్టుకుని చుట్టుపక్కల ఉన్న వాగులు, ఒర్రెల నుండి ఇసుక తవ్వకాలను ఇబ్బడి ముబ్బడిగా చేప డుతున్నారు. గత కొద్ది రోజుల క్రితం ఖానాపూర్‌లో టెండర్ దక్కించుకున్న ఓ వ్యక్తి ఇతర వ్యక్తులను తన చుట్టూ చేర్చుకొని ఆ టెండర్ రసీదును అడ్డుపెట్టుకుని సెలవు దినాలలో వాగులలో ఇసుక తవ్వకాలు చేపట్టినట్లు పోలీసులు సైతం గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలి పారు. అంతకుముందు మరి కొంతమంది నిర్వహిస్తున్న ఇసుక తవ్వకాలను అడ్డుకునేందుకు వెళ్లి రెవెన్యూ అధి కారుల పైనే దాడి చేసేందుకు ప్రయత్నించడంతో బ్రతుకు జీవుడా అంటూ వారు అక్కడి నుండ పరుగులు తీసినట్లు నేరుగా అప్పటి తహసీల్దార్ మీడియా ముఖంగా వెల్ల డించి వారి నిస్సహాయత వ్యక్తం చేశారంటే ఖానాపూర్ ప్రాంతంలో ఇసుక మాఫియా ఏ విధమైన కోరలు చాస్తుం దో తెలుస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం బలంగా దృష్టి సారించి ఖానాపూర్, కడెం ప్రాంతాల్లోని రెవెన్యూ స్థలాల్లో, అడవులలో లభించే ప్రకృతి వనరులను కాపాడి ఈ ప్రాంత భావితరాలకు ఆ వనరులను అందించేలా చర్యలు చేపట్టాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ ఇటీవల ఖానాపూర్‌లో పర్యటించిన సందర్భంగా ఇసుక మాఫియాను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. దీంతో ఆ దిశగా వేగంగా అడుగులు వేసేలా మండల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసేలా కలెక్టర్ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## వ్యవసాయశాఖ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం



మంటల దాటికి దెబ్బతిన్న గోడౌన్

భైంసా, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయశాఖ గోడౌన్‌లో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. మధ్యాహ్నం వేళలో గోడౌన్ వెనుక వైపు బాగం నుంచి ముందుగా పొగ అనంతరం మంటలు వ్యాప్తి చెందడంతో ప్రమాద ఘటన వెలుగు చూసింది. అక్కడి ప్రాంత వ్యాపార సముదాయంలోని దుకాణాల నిర్వాహకులు ప్రమాద సమాచారాన్ని వ్యవసాయ శాఖాధికారులు తెలియచెప్పారు. దీంతో వ్యవసాయ శాఖ సిబ్బంది అగ్నిమాపకశాఖకు సమాచారం అందించగా వారు ఫైరింజన్‌తో హుటహూటిన ఘటన స్థలికి చేరుకొని మంటలనార్పే చర్యలు చేపట్టారు. అయితే గోడౌన్ లోపలికి వెళ్లి మంటలను ఆర్పివేసేందుకు విఫలయత్నం చెందారు. ప్రవేశమార్గంతో పాటు అన్ని వైపులా మూసి ఉండటంతో సమస్య ఏర్పడింది.దీంతో వ్యవసాయ,అగ్నిమాపక శాఖాధికారులు మున్సిపల్ శాఖను సంప్రదించగా వారు జేజేబీ వాహనం ద్వారా గోడౌన్ ప్రవేశ మార్గంలోని ఇనుప ద్వారాన్ని తొలగించారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది లోనికి వెళ్లి మంటలను ఆర్పివేసారు.అప్పటికే అందులోనున్న వ్యవసాయశాఖకు చెందిన రాయితీ పురుగు మందులు, పనిముట్లతో పాటు ఇతర పరికరాలు సామాగ్రి దగ్ధమయ్యింది. ప్రమాదానికి గల కారణాలు,నష్ట వివరాల విషయంలో అగ్నిమాపక అధికారులు విచారణ చేపట్టారు.

**● అగ్ని ప్రమాద ఘటనపై కలెక్టర్ ఆరా**

ఇక్కడి వ్యవసాయ శాఖ గోడౌన్‌లో చోటు చేసుకున్న అగ్ని ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆరా తీసారు. ఘటనకు సంబంధించిన వివరాలు అందించాల్సిందిగా భైంసా తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌ను ఆదేశించారు.దీంతో తహీల్దార్ ఘటన స్థలికి చేరుకొని ప్రమాద ఘటన వివరాలను భైంసా వ్యవసాయాధికారి గణేష్‌ను అడిగి తెలుసుకున్నారు. పూర్తి వివరాలను నివేదిక రూపంలో కలెక్టర్‌కు అందించనున్నట్లుగా తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3,000ల జరిమానా విధిస్తూ సహాయ సెషన్స్ కోర్టు బుధవారం తీర్పు చెప్పింది. సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామానికి చెందిన కుడుకల పోశెట్టి తన చేతిలో బీరు సీసా పట్టుకొని నిన్ను ఎలాగైనా చంపివేస్తానంటూ గుర్రం భీమన్నను కడుపులో పొడవబోగా భీమన్న తప్పించుకోవడంతో కడుపు పక్కకు గాయమైంది. వెంటనే తన భార్య అక్కడికి పరిగెత్తగా అక్కడ ఉన్నటువంటి బర్మ రాములు, గుర్రం ఆశన్న విడిపించగా కుడుకల పోశెట్టి అక్కడి నుండి పారిపోయాడు. బాధితుడిని వెంటనే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అనంతరం బాధితుడిని విచారించగా కడ్తాల్ గ్రామంలో పని చేయుటకు వచ్చిన కూలీలను కుడుకల పోశెట్టి తిడుతుండగా గుర్రం భీమన్న వారిని ఎందుకు తిడుతున్నావని నిలదీశాడు. దాన్ని మనసులో పెట్టుకొని చంపడానికి నాపై దాడి చేశాడని బాధితుడు చెప్పాడు. వెంటనే సోన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి తగు చర్య నిమిత్తం ఫిర్యాదు ఇచ్చాడు. అప్పటి ఎస్సై రవీందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన అనంతరం నేరస్తుడిని అరెస్ట్ చేసి, నేరస్తుడితో పాటు పరిశోధన చేసిన నివేదికను కోర్టులో దాఖలు చేశారు. ఇట్టి కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణ రావు 15 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, సాక్షులు చెప్పి సాక్ష్యం రుజువు కావడంతో సహాయ సెషన్స్ జడ్జి జి. శ్రీనివాస్ నేరస్తుడైన కుడుకల పోశెట్టికి ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 3,000ల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని కోర్టు లైజన్ అధికారి డల్లుసింగ్ తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాల తాళాలు పగులగొట్టిన దుండగులు

కడెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తాళాలను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారు. బుధవారం ఉదయం పాఠశాల అటెండర్ పాఠశాలకు వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే హెడ్ మాస్టర్ భూమేశ్వర్‌కు సమాచారం అందించారు. దీంతో హెడ్ మాస్టర్ పోలీసులకు సమాచారం అందించారు. పాఠశాలలో ఎలాంటి రికార్డులు, సామాగ్రి పోలేదని తెలిపారు.

## రేషన్‌బియ్యం సక్రమంగా అందేలా చూడాలి

**● కలెక్టర్ అభిలాష అభినవ్**

మామడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికి రేషన్‌షాపులలో సన్న బియ్యం సక్రమంగా అందేటట్లు చూడాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం రోజున మండల కేంద్రంలో పదవ తరగతి పరీక్షల చివరి రోజైన ప్రభుత్వ జూనియర్ కళాశాల పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీసీ కెమెరాల నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగా పరీక్ష నిర్వహిస్తున్నారా...? నిర్ణీత సమయంలో ప్రశ్నాపత్రాలను తెరిచారా లేదా అని అడిగి తెలెసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఏఎన్ఎం, సిబ్బంది అందుబాటులో ఉన్నాయా అని అన్నారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీస్ బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వవద్దన్నారు. అనంతరం మండల కేంద్రంలో గల రేషన్‌షాప్‌లో లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని పంపిణీ ప్రారంభించారు. కలెక్టర్ వెంట విద్యాశాఖ అధికారి పరుశురాం, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సుశీల్ రెడ్డి, ఎంఈవో వై. వెంకట రమణారెడ్డి, నాయకులు, ఇతర అధికారులు, గ్రామస్థులు, సిబ్బంది ఉన్నారు.



రేషన్ సన్న బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

## సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి కొనసాగించాలి

**● కలెక్టరేట్‌లో వర్ధంతిసభలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్**



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి కొనసాగించి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో పాపన్న గౌడ్ 315వ వర్ధంతి వేడుకలు అధికారికంగా ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మొగల్ పాలకుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు. డీవో డి. శ్రీనివాస్, సీపీవో జీవరత్నం, సత్యనారాయణ, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, తదితర గౌడ సంఘ, మోకుదెబ్బ, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**రాజ్యాధికారంతోనే అసలైన నివాళి...**

అంతకుముందు మున్సిపల్ కార్యాలయం ఎదుట పాపన్న గౌడ్ విగ్రహానికి తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, మోకుదెబ్బ రాష్ట్ర నాయకుడు పడాల రాజేందర్ గౌడ్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల కోసం పాపన్న గౌడ్ జీవితాన్ని త్యాగం చేశాడన్నారు. బడుగు, బలహీన వర్గాలు రాజ్యాధికారం సాధించినప్పుడే ఆయనకు సరైన నివాళి అని అన్నారు. బీసీ సంఘం అధ్యక్షుడు అనుముల భాస్కర్, కొండా బాలా గౌడ్, టి. వెంకట్ గౌడ్, వై. దశ గౌడ్, పి. శ్రీనివాస్ గౌడ్, కే. మురళి గౌడ్, తదితర నాయకులు పాల్గొని పాపన్న గౌడ్‌కు నివాళులర్పించారు.



గౌడ సంఘ, బీసీ నాయకుల నినాదాలు

**లక్ష్మణచాందలో ఆకస్మికంగా పర్యటన**

లక్ష్మణచాంద, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్‌కుమార్ బుధవారం మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. మండల కేంద్రమైన లక్ష్మణచాంద గ్రామంలో గల చౌకధరల దుకాణాన్ని, తిరుపెల్లి గ్రామంలో గల చౌక ధరల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ రేషన్ షాపులలో గల రికార్డులను చూసి స్టాక్ వివరాలను తనిఖీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిన నేపథ్యంలో పలు రేషన్ షాపులను తనిఖీ చేసి సరుకులు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పంపిణీకి సంబంధించి పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ జానకి, రేషన్ డీలర్ కూన పోశెట్టి, ఇతర రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

**డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు**

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు అన్నారు. మండలంలోని రత్నాపూర్ కాండ్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి బాపూజీ చిత్రపటానికి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని రక్షించుకుందామని గ్రామ ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కరపత్రాలను పంపిణీ చేశారు. రాజ్యాంగ పీఠిక ప్రదర్శన చేపట్టారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కుంట వేణుగోపాల్, ఓడ్నాల రాజేశ్వర్, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, కార్యక్రమ మండల ఇన్‌చార్జి నాయకులు భోజారాం పటేల్, మాజీ ఎంపీపీ కొరిపెల్లి రామేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొండ్ర రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గాండ్ల విలాస్, బండిశీల సాగర్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు

బాసర వద్ద ఇద్దరు పిల్లలతో

## భార్యాభర్తల ఆత్మహత్యయత్నం

**● కాపాడిన పోలీసులు**



బాసర పోలీస్‌స్టేషన్ వద్ద ఆత్మహత్యకు యత్నించిన కుటుంబ సభ్యులను బంధువులకు అప్పగిస్తున్న దృశ్యం

బాసర, ఏప్రిల్, 2 : (ఆంధ్రజ్యోతి) : బాసర వద్ద గోదావరి నదిలో దూకి బుధవారం ఆత్మహత్యకు ప్రయత్నించిన ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు గల ఓ కుటుంబాన్ని పోలీసులు రక్షించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ పట్టణం బోయిగల్లికి చెందిన కోమటి గంగాప్రసాద్ అనే వ్యక్తి తన భార్య, ఆరు సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఇద్దరు పిల్లలతో కలిసి బాసరకు వచ్చారు. నది తీరం వద్ద అనుమానస్పదంగా తిరుగుతుండడంతో అక్కడే బ్లూకోల్ట్ విధుల్లో ఉన్న మోహన్‌సింగ్, దీపాలి అనే మహిళా కానిస్టేబుల్ వారిని గమనించి అడ్డుకున్నారు. వెంటనే వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. బంధువులను పిలిపించి అప్పగించినట్లు బాసర ఎస్సై గణేష్ తెలిపారు. కుటుంబ సమస్యలతోనే ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడిని

## అరెస్ట్ చేసి రిమాండ్ తరలింపు

నర్సాపూర్(జి), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు విద్యార్థినుల పట్ల ఫిబ్రవరి 03, 2025న అసభ్యంగా ప్రవర్తించిన గణిత ఉపాధ్యాయుడు ఆలూరి మనోహర్‌రెడ్డి, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు సాయిని మోహన్‌రావులపై నర్సాపూర్(జి), పోలీసు స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. విద్యార్థునులలో ఒక విద్యార్థిని వెనుకబడిన కులానికి చెందింది కావడంతో పోక్సో కేసుకు అదనంగా ఎస్సీ, ఎస్టీఎస్, పీవోఏ యాక్ట్ జోడించడం జరిగింది. ఈ కేసు విచారణ కోసం రాజేష్‌మీనా ఐపీఎస్, నిర్మల్ ఏఎస్పీలను నియమించారు. కేసు నమోదైన రోజు నుంచి ఇద్దరు నేరస్తులు పరారీలో ఉన్నారు. ఇద్దరు నేరస్తులలో నుంచి మొదటి నేరస్తుడు గణిత ఉపాధ్యాయుడు ఆలూరి మోహన్‌రెడ్డిని మార్చి 8, 2025న నిర్మల్ ఏఎస్పీ రాజేష్‌మీనా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న రెండవ నేరస్తుడైన ఆంగ్ల ఉపాధ్యాయుడు సాయిని మోహన్‌రావును ఏప్రిల్ 1, 2025న నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



బాసర, ఏప్రిల్, 2 : (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ ఆలయం వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) మృతదేహాన్ని పోలీసులు బుధవారం గుర్తించారు. పడుకున్న చోటనే సదరు వ్యక్తి ప్రాణాలు వదిలాడు. గత కొన్ని రోజుల నుండి అమ్మవారి ఆలయం వద్ద యాచకుడిగా ఉంటున్నట్లు స్థానికులు చెప్పారు. మృతుని వద్ద పోలీసులకు ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో ఎవరైనా సంబంధీకులు ఉంటే బాసర పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని బాసర పోలీసులు కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బాసర ఎస్సై గణేష్ తెలిపారు.

## దాబాలలో మద్యం విక్రయంపై కట్టడి

బోథ్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాబాలలో మద్యం విక్రయించవద్దని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై ప్రవీణ్ దాబా హోటల్ యజమానులను ఆదేశించారు. మద్యం విక్రయించినట్లయితే కేసులు తప్పవని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం దాబా హోటల్‌లలో ఎలాంటి మద్యం విక్రయించడం కానీ, సిట్టింగ్‌లు ఏర్పాటు చేయడం లాంటివి చేయవద్దన్నారు. ఒకవేళ ఎవరైనా దాబాలకు వచ్చి మద్యం తాగుతామని ఒత్తిడి తేస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## 'రాజ్యాంగ ఆవశ్యకతను వివరించాలి'

నార్నూర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ పేరుతో నిర్వహించే కార్యక్రమంలో జాతిపిత మహాత్మాగాంధీ గొప్పతనం, రాజ్యాంగం ఆవశ్యకతలను ప్రజలకు వివరించడమే ప్రధాన లక్ష్యమని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాదవ్ నరేష్ అన్నారు. బుధవారం మండలంలోని జమాడా గ్రామ పంచాయతీ పరిధిలో ఈ కార్యక్రమానికి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కలిసి దేశ భవిష్యత్తును ఇబ్బందుల పాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఇందులో ఇన్‌చార్జి ఆదిలాబాద్ పార్లమెంట్ ఆత్రం సుగుణ, పార్టీ మండల అధ్యక్షుడు దేవురావు లోకండే, తదితరులు పాల్గొన్నారు.

## 'పేదలకు అండగా నిలిచేది కాంగ్రెస్సే'

బోథ్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు అండగా ఉండాలని అనేక సంక్షేమ పథకాలను చేపట్టడం జరిగిందని మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి పేర్కొన్నారు. మండలలోని కౌటా(బి) గ్రామంలో సన్న బియ్యం పథకాన్ని తహసీల్దార్‌తో కలిసి ప్రారంభించారు. ఇందులో తహసీల్దార్ సుభాష్ చంద్రతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పి చంటి, రాజు రెడ్డి, రవీందర్ రెడ్డి రేషన్ డీలర్ రవీందర్, ఎం. శ్రీనివాస్ రెడ్డి, సాయికిరణ్ రెడ్డిలు పాల్గొన్నారు.

## పశువుల వాహనాలను ఎలా విడిచిపెట్టారో చెప్పాలి : పతంగే

నేరడిగొండ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఐచర్, రెండు బొలెరో వాహనాలలో 3 ఐచర్, 2 బోలెరోలను ఏ చట్టం ప్రకారం విడిచిపెట్టారో నేరడిగొండ ఎస్సై, ఇచ్చోడ సీఐ సమాధానం చెప్పాలని గుడిహత్నూర్ మాజీ జడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్ డిమాండ్ చేశారు. బుధవారం నేరడిగొండ మండల కేంద్రంలోని పెద్ద హనుమాన్ ఆలయం వద్ద హిందూ సంఘాల నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 27న ఉదయం పశువులను అక్రమంగా తరలిస్తున్నారని హిందూ సంఘాల నాయకులకు సమాచారం అందడంతో వారు స్థానిక ఎస్సైకు సమాచారం అందించినా వారు స్పందించకపోవడంతో, మండలంలోని రోల్ మామడ టోల్ ప్లాజా వద్ద గస్తీ నిర్వహిస్తున్న పోలీసుల సహాయంతో అట్టి వాహనాలను ఆపడం జరిగిందన్నారు. అనంతరం ఎస్సైకి మరోమారు హిందూ సంఘాల నాయకులు ఫోన్ చేసినా స్పందించక పోవడంతో పోలీసులతో ఎస్సైకు సమాచారం అందించారాని ఆయన వివరించారు. ఇందులో విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్, హిందూ వాహిని, హిందూ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నీటి కుంట భూవివాదంపై 4న విచారణ

బోథ్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌట(బి) గ్రామంలో సర్వే నెం.149లో ఉన్న నీటి కుంట భూమి విషయమై ఈ నెల 4న విచారణకు తహసీల్దార్‌తో పాటు ఇరిగేషన్ అధికారులు రానున్నారు. గతంలో కొంత మంది యజమానుల నుండి ఈ భూమిని కొనుగోలు చేసి కుంట నిర్మాణం చేపట్టారు. అయితే ఆ భూమిని జాదవ్ గోపాల్ అనే వ్యక్తి పట్టా పొందడం జరిగింది. 2012 సంవత్సరంలో పట్టా మార్పిడి జరిగిందని తహసీల్దార్ సుభాష్ చంద్ర వివరించారు. అయితే ఈ విషయమై గ్రామస్థుల ఫిర్యాదుతో పూర్తిస్థాయి విచారణ జరపనునున్నారన్నారు. సర్వేలో ఇరిగేషన్ అధికారుల సైతం పాల్గొంటారన్నారు. ఆ తర్వాత ఈ భూమి విషయం ఇక నిర్ణయం తీసుకుంటామని వివరించారు.

# ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు లైన్ క్లియర్

● రాష్ట్ర ప్రభుత్వ లేఖకు స్పందించిన రక్షణ శాఖ ● ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం

● ఎయిర్ పోర్టు పై జిల్లా వాసుల్లో చిగురిస్తున్న ఆశలు


ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఎయిర్‌పోర్టును నిర్మించే స్థలం

ఆదిలాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ఎట్టకేలకు లైన్ క్లియర్ అయ్యింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖకు రక్షణ శాఖ స్పందిస్తూ ఆమోదం తెలిపింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న 369 ఎకరాలలో ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేసేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఒక ప్రకటనను విడుదల చేసింది. ఎయిర్ పోర్టుకు అవసరమైన టర్మినల్, రన్‌వే, ఇతర వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించింది. ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియాతో కలిసి విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవచ్చునని రాష్ట్ర ప్రభుత్వానికి రక్షణ శాఖ సూచించింది. భవిష్యత్తులో ఎయిర్‌ఫోర్స్ అవసరాలకు కూడా ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఎయిర్‌పోర్టు నిర్మాణం వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేయడంతో జిల్లా వాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

● ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అనుకూలం

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేసేందుకు అన్ని రకాల అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని కలిపే 44వ జాతీయర రహదారి జిల్లా మీదుగానే వెళ్తుంది. దక్షిణ భారతదేశానికి కేంద్ర బిందువుగా ఉన్న ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేస్తే రవాణా సౌకర్యాలు మెరుగు పడడంతో పాటు మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుంది. రక్షణ శాఖ అధీనంలో ఉన్న 369 ఎకరాలతో పాటు ఆదిలాబాద్ పట్టణ శివారు ప్రాంతంలోని అనుకుంట, కచ్‌కంటి, తంతోలి గ్రామాల పరిధిలో మరో 1590.05 ఎకరాలను భూములు అందుబాటులో ఉన్నాయి. ఈ భూములను సేకరించేందుకు రూ.438.67 కోట్లు నిధులు అవసరమని ఇప్పటికే అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

● ప్రధాని మోదీ, రక్షణ శాఖ మంత్రికి ధన్యవాదాలు

ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కృషి చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఎంపీ గోడం నగేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్ పోర్టు విషయమై ఇప్పటి వరకు పలుమార్లు కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలవడం జరిగింది. అలాగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కూడా డిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి ఎయిర్‌పోర్టు నిర్మాణ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు.

# నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

● సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


ఉట్నూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ నియోజకవర్గంలోని 8 మండలాల్లో ఉన్న 69 గ్రామాలలో మంచినీటి సమస్యలు తలెత్తుతున్నందున వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్సీ భవనంలో ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల గ్రామీణ నీటి పారుదల శాఖ, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉట్నూర్ మండలంలో 24 గ్రామాలు, ఇంద్రవెల్లి మండలంలో 15 గ్రామాలను కలుపుకొని నియోజకవర్గంలో 69 గ్రామాలలో మంచినీటి సమస్య తక్షణమే పరిష్కరించాలన్నారు. గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఆయా గ్రామాలలో ఉన్న ప్రతీ బోరుబావి నీటిని పరీక్షల కోసం పంపించాలన్నారు. గ్రామాలలో ఉన్న బోరుబావులు సరిగ్గా పనిచేసేలా చూడాలని కార్యదర్శులను ఆదేశించారు. ఇది వరకే గ్రామాలలో నిర్మించిన ట్యాంకులకు ఉన్న పైపులైన్లు ఎక్కడైనా చెడిపోయి ఉంటే మరమ్మత్తులు చేయించి ట్యాంకులకు నీరు అందేలా చూడాలని పలు అంశాలపై మాట్లాడారు. ఇందులో ఎంపీడీవో రాంప్రసాద్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాస్, పీఆర్‌డీఈ పవార్‌రమేష్, ట్రాన్స్‌కో డీఈ సుభాస్, ఐటీడీఏ డీఈ శివప్రసాద్, ఎంపీవో సుధీర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ వసంతరావు, డీసీబీ డైరెక్టర్ ఎస్పీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● మరింత మెరుగైన భోజనం అందించాలి

**ఉట్నూర్:** మహిళలను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని భావించిన ప్రభుత్వం ఇందిరా మహిళ శక్తి క్యాంటిన్లు ఏర్పాటు చేసిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. బుధవారొ కొమురంభీం ప్రాంగణంలో సమీక్ష సమావేశాలు నిర్వహించిన సందర్భంగా ఇందిరా మహిళ శక్తి క్యాంటిన్‌లో అధికారులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా క్యాంటిన్ నిర్వాహకులతో మాట్లాడుతూ ప్రజల అభిరుచి మేరకు టిఫిన్లు, భోజనం అందుబాటులో ఉంచాలన్నారు. ప్రస్తుతం వడ్డిస్తున్న భోజనం బాగానే ఉన్నప్పటికి మరికొన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.

**ఉట్నూర్:** మండల కేంద్రంలోని గంగన్నపేటలో కొత్త మహేందర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ బుధవారం ప్రారంభించారు. ఇందులో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖయ్యుం, ఏఎంసీ వైస్ చైర్మన్ బానోత్ వసంతరావు, ఎస్సీ సెల్ జిల్లా ఇన్‌చార్జీ లింగంపల్లి చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇక్బాల్, మాజీ సర్పంచ్ ఆత్రం రాహుల్, ఏఎంసీ డైరెక్టర్ రాధాబాయి, తదితరులున్నారు.

సుప్రీంతీర్పు అనుసరించి ప్రత్యేక ఉపాధ్యాయులను రెగ్యూలర్ చేయాలి.

**ఉట్నూర్:** సుప్రీంకోర్టు తీర్పు అనుసరించి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల విద్యాబివృద్ధి కోసం పని చేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులను రెగ్యూలర్ చేయాలని ప్రత్యేక అవసరాల విద్యార్థుల సీఆర్‌పీలు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ను కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతపత్రం అందించారు.

## నీటి అంచనాలు తారుమారు

(5వ పేజీ తరువాయి...)

చేరుకుంది. మత్తడివాగు నీటి నిల్వ 271.950 మీటర్లకు చేరుకుంది. నీటి నిల్వలు పడిపోవడంతో వేసవిలో నెల రోజుల ముందే ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్నాయి.

**ఎగువ భాగాన అడ్డుకట్టలు ఏవీ?!**

ప్రాజెక్టు నిర్మాణం చేపట్టగానే ఎగువ భాగంలో షిల్ట్ అరెస్టు ట్యాంకులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టు ఎగువ భాగంలో అడ్డుకట్టలను వేయక పోవడంతో ప్రాజెక్టుల్లోకి భారీగా పూడిక మట్టి వచ్చి చేరుతోంది. జిల్లాలో అధికంగా నల్లరేగడి నేలలే ఉండడంతో చిన్నపాటి వర్షాలకే నేల కోతకు గురై వరద నీటితో ప్రాజెక్టుల్లోకి వచ్చి చేరుతోంది. కనీసం ప్రాజెక్టు ఎగువ భాగాన ఉన్న వాగులపై చెక్‌డ్యాంలను నిర్మించి ఉంటే కొంత వరకైనా పూడిక మట్టికి అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టుల ఎగువ బాగానా ఎత్తైన కొండలు, గుట్టలు ఉండడంతో చిన్నపాటి వర్షాలకే పూడికమట్టి వేగంగా ప్రాజెక్టులోకి చేరుకునే అవకాశం ఉంది. ఇప్పటి వరకు సుమారుగా 35మీటర్ల మేరకు పూడికమట్టి చేరి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆధునిక పద్ధతుల ద్వారా తొలగించేందుకు ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రాజెక్టుల నీటి నిల్వలు ప్రశ్నార్థకంగా మారాయి.

**ప్రతిపాదనలకే పరిమితం**

ప్రాజెక్టుల్లో చేరిన పూడికలను తొలగించేందుకు యేటా జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నా- చర్యలు మాత్రం కనిపించడం లేదు. ఏళ్ల తరబడి పూడిక మట్టిపై సర్వే చేపట్టక పోవడంతో వాస్తవ పరిస్థితులను తెలుసుకునే అవకాశం లేకుండా పోయిందంటున్నారు. ప్రాజెక్టుల వద్ద తలెత్తే సమస్యలను వేసవిలోనే పరిష్కరించుకొని ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాల్సి ఉంటుంది. ప్రాజెక్టుల ఆనకట్టలు, ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా కనిపిస్తున్నాయి. అక్కడక్కడ నెర్రలు బారీ బుంగలు పడి దర్శనమిస్తున్నాయి. కాలువల పరిస్థితి అయితే మరీ అధ్వానంగా మారింది. అక్కడక్కడ సిమెంట్ పనులు ధ్వంసమై పోయి కనిపిస్తున్నాయి. ప్రాజెక్టుల కుడి, ఎడమ కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగి పోయి కనిపిస్తున్నాయి. వర్షాకాలానికి సమయం దగ్గర పడుతుండడంతో అధికారులు ఇకనైనా ప్రాజెక్టులపై ప్రత్యేకదృష్టిని సారించాలని రైతులు కోరుతున్నారు. యేటా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా అరకొరగానే నిధులు మంజూరుకావడంతో మరమ్మతులు నామమాత్రంగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా గేట్ల మరమ్మతులకే పరిమితమవుతున్నారు. పూడిక తొలగింపు, ధ్వంసమైన పనులను చేపట్టేందుకు నిధుల కొరత ఉందని అధికారులే చెబుతున్నారు.

## పురుగుల మందు తాగి ఒకరి మృతి

తలమడుగు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన ఎల్లుల చిన్ననర్సయ్య(33) మద్యానికి బానిసై తాగిన మైకంలో పురుగుల మందు తాగి మృతి చెందాడని ఎస్సై అంజమ్మ తెలిపారు. ఆమె వివరాల ప్రకారం దేవాపూర్ గ్రామానికి చెందిన ఎల్లుల చిన్ననర్సయ్య గత కొంతకాలంగా తాగిన మైకంలో మార్చి 31న వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి స్పృహ తప్పి అక్కడే పడిపోగా కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ నుంచి తరలించారు. కాగా చికిత్స పొందుతూ ఈ నెల 2న బుధవారం మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు పేర్కొన్నారు.

## జొన్న పంటపై అడవి పందుల దాడి

తాంసి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అసలే భూగర్భ జలాలు అడుగంటిపోయి అన్నదాతలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ అవస్థల్లోనే పందుల బెడద మరింత తీవ్రతరమైంది. దీంతో చేతికి వచ్చే జొన్న పంటకు నష్టం వాటిల్లుతోందని రైతులు అంటున్నారు. రాత్రి సమయాల్లో అడవిపందులు జొన్న పంటచేలలోకి చొరబడి తీవ్రంగా ధ్వంసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవి పందులకు కరెంటు షాక్ పెడదామంటే ఎవరైనా వ్యక్తులు సంచరిస్తారేమోనని భయపడుతున్నారు. తెల్లారి పంట పొలానికి వెళ్లి చూస్తే పంట అంతా భూమిపై వేలాడుతుందని అంటున్నారు. పందుల నివారణకు ఉపాయం తెలపాలని జొన్న రైతులు కోరుతున్నారు.

## కాలినడకన కొండగట్టుకు అంజన్న స్వాములు

లోకేశ్వరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రం నుండి దాదాపు పది మంది హనుమాన్ స్వాములు కాలినడకన బుధవారం కొండగట్టుకు బయలుదేరారు. ఈ సందర్భంగా హనుమాన్ స్వాములు మాట్లాడుతూ... మాల వేసుకున్న హనుమాన్ స్వాములు ఒక్కసారైనా కొండగట్టుకు కాలినడకన వెళ్లి ఆ కొండగట్టు అంజన్న స్వామిని దర్శనం చేసుకోవాలన్నారు. ఇలా చేసుకోవడం వల్ల స్వామి వారు అన్ని రకాల శుభాలు కలుగజేస్తారన్నారు. ఈ కాలినడకలో వివిధ స్వాములు పాల్గొన్నారు.

**హనుమాన్ దీక్షాదారులకు భిక్ష**



కడెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండుకూర్ గ్రామంలో ఆంజనేయస్వామి మందిరంలో ఆంజనేయ స్వామి దీక్ష పరులకు జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వాములతో కలిసి భిక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్వాములు సతీష్‌రెడ్డికి శాలువా కప్పి సన్మానం చేసి, అభినందించారు. ఈ కార్యక్రమంలో అంజనేయ దీక్ష పరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**పల్సిని మండలంగా ప్రకటించాలి**

కుభీర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్సి గ్రామానికి మండలంగా ప్రకటించాలని బుధవారం తాజామాజీ సర్పంచ్ శ్రీరాముల రాజేశ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 సర్వసభ్య సమావేశంలో పల్సి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని తీర్మానించడం జరిగిందన్నారు. కుభీర్ మండలానికి ప్రజలు రావాలంటే ధూర భారం అవుతుందన్న ఉద్దేశంతో, అన్ని వసతులు ఉండి చుట్టుపక్కల అన్ని గ్రామాలకు దగ్గరలో , అనుకూలంగా ఉన్న గ్రామమైనటువంటి పల్సిని మండలంగా ఏర్పాటు చేయాలన్నారు. లేని యెడల ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి, రాస్తారోఖోలు, నిరాహార దీక్షలు, చేయడానికి గ్రామస్తులం సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికయిన ఎమ్మెల్యే రామరావుపాటిల్ స్పందించి పల్సి ని మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సాధన సమితి సభ్యులు, గ్రామ యువకులు, గ్రామప్రజలున్నారు.

## ఆర్థిక సహాయం అందజేసిన మిత్రబృందం



ముథోల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ముథోల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి 2000-2001 బ్యాచ్‌కు చెందిన ఉజ్వల భర్త సురేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్ర బృందం బుధవారం లోకేశ్వరం మండలంలోని వట్టోలి గ్రామానికి వెళ్లి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే మిత్ర బృందం రూ. 36 వేల ఆర్థిక సహాయాన్ని తమ పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన ఉజ్వలకు అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. మిత్రులకు ఎవరికైనా కష్ట కాలంలో ముందుంటామని తెలిపారు. కష్ట కాలంలో మనోధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతి మిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

# పది పరీక్షలు ప్రశాంతంగా పూర్తి : నిర్మల్ డీఈవో


సెట్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఈవో


పరీక్ష ముగియడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలను ప్రశాంతంగా పూర్తి చేసినట్టు డీఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నిర్వహించిన సాంఘిక శాస్త్ర పరీక్షకు 12 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా 9,117 మంది హాజరైనట్టు పేర్కొన్నారు. ఉదయం సీఈవోలు, డీవోలతో సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. పరీక్షలకు సహకరించిన ప్రతి ఒక్క శాఖలకు కృతజ్ఞతలు తెలిపారు. సెట్ కాన్ఫరెన్స్‌లో పరీక్షల సహాయ కమిషనర్ మూడారపు పరమేశ్వర్, గణాంక సమన్వయ కర్త లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

సోన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు సాంఘిక శాస్త్రం పరీక్ష నిర్వహించారు. మధ్యాహ్నం పరీక్ష ముగియగానే కేంద్రాల నుంచి విద్యార్థులు ఉల్లాసంగా బయటకు వచ్చారు. తోటి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ హాస్టల్ విద్యార్థులు ఇంటి బాట పట్టారు.

లోకేశ్వరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షలు మార్చి 21 నుండి ప్రారంభమైన ఏప్రిల్ 2తో ముగిశాయి. లోకేశ్వరం మండల కేంద్రంలో రెండు సెంటర్లలో 245 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఈ పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలు రాశారు. పరీక్షలు బుధవారంతో ముగియడంతో సెంటర్ నుండి విద్యార్థులు సంతోషంతో బయటకు వచ్చారు.

# అంబేద్కర్ సిద్ధాంతమే దేశానికి ఆయువు పట్టు

లక్ష్మణచాంద, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్, గాంధీల సిద్ధాంతమే ఈ దేశానికి ఆయువు పట్టు అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్ బుధవారం అన్నారు. మండలంలోని తిరుపెల్లి, చామన్‌పెల్లి, చింతల్‌చందా గ్రామాల్లో 'జై బాపు - జై భీమ్ - జై సంవిధాన్' పేరుతో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠికను చదివి వినిపించారు. గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేశారు. జెండా ఎగురవేసి నినదించారు. భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించటం కోసం మేమంతా ఏకమై కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడి సొంతగ్రామమైన చింతల్‌చందా గ్రామంలో కార్యక్రమం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బండలమీది మోహన్, తాండ్ర రాజేశ్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. డీజేలతో ఊరేగింపు నిర్వహించారు. యువకులు నృత్యాలు చేశారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అంటూ నినాదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్ ఓడ్నాల రాజేశ్వర్‌తో పాటు నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, నాయకులు ప్రతాప్ రెడ్డి, సయ్యద్ సిరాజుద్దీన్, కల్లెడ భూమన్న, సమ్మెట రవి, ఓస రాజేశ్వర్, పోతారెడ్డి, బిట్లింగ్ నారాయణ, గంగాధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# కుల బహిష్కరణ నుంచి విముక్తి కల్పించండి



ధర్నా చేస్తున్న బాధితులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కుల బహిష్కరణ నుండి విముక్తి కల్పించాలని కోరుతూ బుధవారం లక్ష్మణచాంద మండల వడ్యాల్ నర్సాపూర్ గంగపుత్ర కులస్తులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వీరికి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మద్దతు తెలిపింది. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... గంగపుత్ర సంఘం అధ్యక్షుడు మహిపాల్‌ను కుల సంఘంలో లెక్కలు అడిగినందుకు పది కుటుంబాలను కుల బహిష్కరణ చేశారని ఆరోపించారు. ఓ మహిళపై ఇటీవల దాడి చేశారన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పలుకుబడి గల వ్యక్తి కావడం వల్లనే ఈ విధంగా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. న్యాయం చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి. నూతన్ కుమార్, అధ్యక్షుడు డి.తిరుపతి, మురళీమోహన్, హెచ్‌ఆర్సీకి సంఘం అధ్యక్షుడు సురకంటి ఎల్లారెడ్డి, బాధితులు పుట్టి భీమన్న, ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఐకేపీ వీవోఏ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో ధర్నా

కడెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఐకేపీ వీవోఏ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిమాండ్ లను నెరవేర్చాలని ధర్నా చేశారు. మహిళా సంఘాలకు ఏడు సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్నటు వంటి రావాల్సిన స్త్రీనిధి వడ్డీ, మూడు సంవత్సరాలుగా స్త్రీనిధి ఇన్సెంటివ్, వీవోఏ, వీవోలకు, స్త్రీనిధి బ్యాంక్ నుండి ప్రత్యేకంగా వీవోఏలకు 10,000ల వేతనం చెల్లించాలని, పెండింగ్ క్లైమ్‌లు అన్ని వెంటనే క్లియర్‌చేయాలని కడెం మండలంలోని వీవోఏలు నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రవి, విక్రమ్, నర్సయ్య, ముత్తయ్య, సారిక, విజయ, సుష్మిత, తదితరులు పాల్గొన్నారు.


సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ యూత్ సభ్యులు

## సన్న బియ్యం పంపిణీ ద్వారా పేదలకు మరింత లాభం

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సన్న బియ్యం పంపిణీ ద్వారా పేదలకు మరింత లాభం చేకూరుతుందని జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పి.సమరసింహారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలోని రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుజ్జాల లక్ష్మీ, నారాయణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్ల రాజారెడ్డి, రేషన్ డీలర్ కొరిపెల్లి శేఖర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ పి.శ్రీకాంత్, తది తరులు పాల్గొన్నారు.

**..పథకాన్ని సద్వినియోగం చేసుకోండి**

ఖానాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన బియ్యం పంపిణీ పథకాన్ని రేషన్ కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్ అన్నారు. బుధవారం మండలంలోని తర్లపాడ్ గ్రామంలో నిర్వహించిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం నిరుపేదల అభివృద్ధిని నిరంతరం కాంక్షిస్తుందన్నారు. అందులో భాగంగానే దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ దుకాణాలలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేయడంతో ప్రభుత్వ లక్ష్యం పక్కదారి పట్టేదని నేడు రేషన్ దుకాణాలలో సన్న బియ్యం పంపిణీతో ప్రతి ఒక్కరూ వాటిని తాము తినేందుకు ఉపయోగిస్తారన్నారు. సన్న బియ్యం పంపిణీతో ప్రతి ఒక్కరికి పౌష్టికాహారం దక్కాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తర్లపాడ్ గ్రామ అధ్యక్షుడు సార్ల నర్సయ్య, మండల నాయకులు పొలంపెల్లి సచిన్, వీడీసీ అధ్యక్షులు గోపు రత్నం, మాజీ సర్పంచ్ ఆర్. నారాయణ, మాజీ ఉప సర్పంచ్ బొంత చినబాపు, పీఏసీఎస్ డైరెక్టర్ రఘుపతిరెడ్డి, గ్రామస్థులు పెద్ది నర్సయ్య, రామిడి మహేష్, నిట్ట రవి, ఎం. లింగు, బోరుబొంతల వెంకటరాజం, ఇప్పటి సంతోష్, బాల్యాల శ్రీనివాస్, గోసెల నారాయణ, పల్లెర్ల రమేష్, బాల్యాల వెంకటేష్, రాకేష్ రెడ్డి, అల్లెపు వెంకటి, కాంగ్రెస్ మహిళా విభాగం గ్రామ అధ్యక్షురాలు చింతపండు సత్తవ్వ, తదితరులున్నారు.

## వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు

భైంసా రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖద్గాం గ్రామంలో బుధవారం వాహనాల తనిఖీని ఎస్సై శంకర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వాహనదారులు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలు తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరి ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి జరిమానా విధిస్తామని తెలిపారు. ఏఎస్సైమారుతి, పోలీస్‌బృందం, తదితరులు పాల్గొన్నారు.

**ముథోల్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి**

ముథోల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లో బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315 వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫటా..ఫట్...

### రాష్ట్ర సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక నిఘా

● రేండ్ల విజయేందర్, ఎక్సైజ్ స్టేషన్ సీఐ, ఆదిలాబాద్



**ఆంధ్రజ్యోతి:** మహారాష్ట్ర నుంచి సరఫరా అవుతున్న దేశీదారు మద్యాన్ని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**సీఐ:** జిల్లా సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నాం. దేశీదారు మద్యం సరఫరాను అరికట్టేందుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశాం. ప్రతీరోజు ఉదయం సాయంత్రం వేళల్లో రెండు గంటల పాటు ప్రత్యేక దృష్టిని సారిస్తున్నాం. అలాగే రాత్రి వేళల్లో రూట్‌వాచ్ చేస్తూ కంట్రోల్ చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

**ఆంధ్రజ్యోతి:** దేశీదారు మద్యాన్ని అమ్ముతు పట్టుబడుతున్న వారి పై కేసులు నమోదు చేస్తున్నారా...?

**సీఐ:** అక్రమంగా దేశీదారు మద్యాన్ని అమ్ముతు మొదటిసారి పట్టుబడుతున్న నిందితులను హెచ్చరిస్తున్నాం. ఆ తర్వాత రెండవ సారి పట్టుబడితే బ్రీచ్ కేసులను నమోదు చేస్తూ లక్ష రూపాయల జరిమానాను విధిస్తున్నాం. మళ్లీ మద్యాన్ని విక్రయిస్తూ పట్టుబడితే జైలుకు పంపుతున్నాం. గడిచిన యేడాదిలో మూడు బ్రీచ్ కేసులను నమోదు చేయగా ఒకరికి లక్ష రూపాయల జరిమానా విధించి ఇద్దరిని రిమాండ్‌కు పంపించాం.

**ఆంధ్రజ్యోతి:** ప్రభుత్వం విధించే లిక్కర్ టార్గెట్‌ను ఎలా అదిగమిస్తున్నారు...?

**సీఐ:** ప్రతీ యేడు మాదిరిగానే ఈ యేడు కూడా ప్రభుత్వం లిక్కర్ సేల్స్ పై టార్గెట్‌ను విధించింది. మార్చి నెలలో ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలో రూ.20కోట్ల సేల్స్ టార్గెట్ ఉంది. ఇప్పటి వరకు రూ.11.5 కోట్ల టార్గెట్‌ను పూర్తి చేశాం. నెలాఖరు వరకు టార్గెట్ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

**ఆంధ్రజ్యోతి:** ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఏమైనా సిబ్బంది కొరత ఉందా...?

**సీఐ:** కొంత వరకు సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. అయిన సిబ్బందిని సర్దుబాటు చేస్తున్నాం. స్టేషన్ పరిధిలో ముగ్గురు సబ్ ఇన్‌స్పెక్టర్లు ఉండాలి. ప్రస్థుతం ఒకరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అయిన ఎలాంటి ఆటంకాలు లేకుండా సేవలను అందిస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి:** అక్రమంగా మద్యాన్ని అమ్ముతు పట్టుబడుతున్న కుటుంబాలకు పునరావాసం కల్పిస్తున్నారా?

**సీఐ:** దేశీదారు మద్యం, నాటుసారా అమ్ముతు జీవనం సాగిస్తున్నా కుటుంబాలను బయటకు తీసుకొచ్చేందుకు పునరావాస చర్యలు తీసుకుంటున్నాం. గతంలో చాలా మందికి ప్రత్యామ్నయంగా ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మళ్లీ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తాం. ● (ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి)




వాగు ఒడ్డునే నిర్మించిన శ్మశానం

## వాగు ఒడ్డునే శ్మశానం

వాగులు, వంకలకు సమీపంలో శ్మశాన వాటికలు నిర్మించడం సహజమే. కాని నేరడిగొండ మండలం వాంకిడిలో మాత్రం వాగు ఒడ్డుకు ఆనుకుని నిర్మించడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతియేటా వర్షాకాలంలో ఈ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. అటువైపు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. దీంతో ఆ సమయంలో దహన సంస్కారాలు చేయడం ఇబ్బందిగా మారుతుందని పలువురు చెబుతున్నారు.

● (ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్)





ఒకే గదిలో కూర్చుండి చదువుకుంటున్న విద్యార్థులు



కుమ్మరి తండాలో నిర్మాణం పూర్తయిన మన ఊరు మనబడి అదనపు తరగతి గది

# ఒకే గదిలో ఐదు తరగతులు

● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
● అదనపు భవనం నిర్మించినా అప్పగించని కాంట్రాక్టర్..!?

ఉట్నూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఐదు తరగతులు ఉన్న పాఠశాలలో ఒకే గది ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉట్నూర్ మండలంలోని కుమ్మరి తండా గ్రామంలోని చిన్నారులకు విద్యా బుద్దులు నేర్పించడానికి గ్రామస్థులు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పంపిస్తున్నారు. ఐదు తరగతుల విద్యార్థుల కోసం ఇద్దరు ఉపాధ్యాయు లను అధికారులు నియమించారు. ఒకటి నుంచి ఐదు తరగతి వరకు 37 మంది విద్యార్థులు ఉండడంతో ఒకటి రెండు తరగతులను వరండాలో ఒక ఉపాధ్యాయుడు, మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు గదిలో కూర్చో బెట్టి మరో ఉపాధ్యాయుడు పాఠాలు నేర్పిస్తున్నారు. ఒక గదిలో మూడు తరగతుల విద్యార్థులు కూర్చుని పాఠాలు వినడం ఇబ్బందిగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

### అదనపు గది నిర్మించినా అప్పగించని కాంట్రాక్టర్..!?

కుమ్మరితండా గ్రామస్థుల కోరికపైన మండల విద్యాధికారులు జిల్లా విద్యాశాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపించడంతో రూ.14 లక్షలతో మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా అదనపు గది నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ పనులు చేపట్టి పూర్తి చేసినప్పటికి ఏడాది కాలంగా నిధులు రాక పోవడంతో సదరు కాంట్రాక్టర్ నిర్మాణం పూర్తి అయిన పాఠశాల భవనాన్ని ఉపాధ్యాయులకు అప్పగించ లేదు. పాఠశాల ఆవరణలో అదనపు గది నిర్మాణం జరిగిన ప్రయోజనం లేకుండా పోయిందని విద్యార్థులు ఉపాధ్యాయులు వాపోతున్నారు. సదరు కాంట్రాక్టర్ విద్యార్థుల కోసం భవనం ఇవ్వకుండా తన బంధువులు కొత్త గృహం నిర్మించుకుంటున్నందున వారు ఉండేలా వారికి అప్పగించినట్లు గ్రామస్థుల ద్వారా తెలుస్తుంది. ఏది ఏమైనా విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా జిల్లా అధికారులు నిర్మాణం పూర్తి అయిన పాఠశాల భవనాన్ని నిర్మానం పూర్తి చేసిన కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించి విద్యార్థుల కస్టాలు గట్టు ఎక్కించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



భైంసాలో భక్తులకు సందేశమిస్తున్న పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామి



మాలధారణ వేసిన హనుమాన్ దీక్షదారులు

## భక్తి మనిషిని సన్మార్గంలో నడిపిస్తుంది

● అఖిల భారత హనుమాన్ దీక్షా పీఠాధిపతి దుర్గా ప్రసాద్ స్వామి

భైంసా, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు మనిషిని సన్మార్గంలో ముందుకు నడిపిస్తాయని అఖిల భారత హనుమాన్ దీక్షా పీఠాధిపతి దుర్గా ప్రసాద్ స్వామి పేర్కొన్నారు. బుధవారం భైంసాలోని గణేష్‌నగర్ మున్నురుకాపు సంఘ భవనంలో హనుమాన్ దీక్షదారుల మాలాధారణ స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా భక్తులకు సందేశమిచ్చారు. భారతీయ ధర్మానికి పట్టుగొమ్మలైన రామాయణం, భారతం, భాగవతం లాంటి ఇతిహాస గ్రంథాలు మానవాళి జీవన విధానానికి ప్రభావితం చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ హైందవ ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దానం, ధర్మం, అహింస, సత్యంతో జీవించాలని ఉపదేశించారు. ఆలయాలు, గో పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కంకణబద్దులు కావాలని పిలుపునిచ్చారు. స్త్రీలను, పెద్దలను గౌరవిస్తూ సనాతనమైన సంస్కృతి, సంప్రయదాలు, అచార వ్యవహారాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఆపద సమయంలో కాకుండా అన్ని వేళల్లోనూ ఆలయాల సందర్శన చేపట్టాలన్నారు. భక్తి, భావాలను పెంపొందించుకుంటూ ఆధ్యాత్మికతో నడుచుకోవాలన్నారు. అఖిల భారత హనుమద్దీక్షా సేవా సమితి భైంసా శాఖ ప్రతినిధి తూమోల్ల దత్తాత్రి నేతృత్వంలో జరిగిన మండల దీక్ష మాలధారణ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వందలాది మంది హనుమాన్ దీక్షను స్వీకరించారు.

## పన్నుల వసూళ్లలో చతికిల పడ్డ భైంసా బల్దియా

● 50 శాతానికి కూడా చేరని వసూళ్లు
● జిల్లాలో చివరి స్థానానికి పరిమితమైన వైనం




భైంసా మున్సిపల్ కార్యాలయం

భైంసా, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అధికారులు అవలంభించిన అలసత్వ విధానాలకు నిర్వహణ సిబ్బంది బాధ్యతారాహిత్య వైఖరి తోడవ్వడం మూలంగా భైంసా మున్సిపాలిటీ పన్నుల వసూళ్ల ప్రక్రియలో చతికిలపడిపోయింది. పన్నుల వసూళ్లకు సంబంధించి ఉమ్మడి జిల్లా పరిధిలోని 12 మున్సిపాలిటీలలో భైంసా మున్సిపాలిటీ 11వ స్థానంలో నిలువగా జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో చివరి స్థానంలో నిలిచింది. గతంలో పన్నుల వసూళ్లలో రాష్ట్ర స్థాయిలో మొదటి పది స్థానాల్లో నిలిచిన భైంసా మున్సిపాలిటీ గత కొన్ని సంవత్సరాలుగా వెనుకబడిపోతోంది. ప్రధానంగా మున్సిపల్ అధికారులు అనుసరిస్తున్న నిర్లక్ష్యపూరిత వైఖరి విధానాల మూలంగానే పన్నుల వసూళ్లు సక్రమంగా కావడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి.

### ● 50 శాతానికి కూడా చేరని పన్నుల వసూళ్లు

భైంసా మున్సిపాలిటీ పన్నుల వసూళ్ల లక్ష్యంలో 50 శాతానికి చేరుకోలేదు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గాను భైంసా మున్సిపాలిటీకి రూ.5.17 కోట్ల లక్ష్యం ఉండగా మార్చి 31 నాటికి 46.23 శాతంతో కేవలం రూ.2.39 కోట్లు మాత్రమే వసూళ్లు జరిగాయి.ఇక నిర్మల్ మున్సిపల్ పరిధిలో రూ.10.77 కోట్ల లక్ష్యం ఉండగా 58.68 శాతంతో రూ.6.32 కోట్లు, ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో రూ.1.93 కోట్లు ఉండగా రూ.1.08 కోట్ల పన్నుల వసూళ్లు అయ్యాయి. ఇక్కడి మున్సిపాలిటీలో 55.96 శాతం పన్నుల వసూళ్లు జరిగింది.

## రేపటి నుంచి ఆష్టలో సీతారాముల కల్యాణ మహోత్సవం



ఆలయంలో సీతారాముల స్వామివారు

ముథోల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ముథోల్ మండలంలోని ఆష్ట గ్రామంలో గల శ్రీ సీతా రామ చంద్ర ఆలయంలో ఈ నెల 4వ తేదీ నుండి 6వ తేదీ వరకు శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరుగనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఆర్మూర్ సంతోష్ రెడ్డి, నిర్వాహకులు రావుల శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 4 నుండి 5వ తేదీ వరకు శాస్త్రీయ నృత్య పోటీలు, 4వ తేదీన మాదవనంద సరస్వతీ స్వామి సంకల్పిత కోటి రుద్ర పారాయణం, అంతర్గత శ్రీ సూక్తి పారాయణం ఉంటుందని తెలిపారు. 6వ తేదీన ఉదయం అభిషేకం, శ్రీరామ జననం, సీతారాముల కల్యాణ మహోత్సవం, ఉత్సవ విగ్రహాల అభి షేకం, హారతి, అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, నృత్య ప్రదర్శన, భక్తి గీతాల ఆలపన తదితరవి జరుగనున్నట్లు తెలిపారు.

### శాస్త్రీయ నృత్య పోటీలు

ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 5వ తేదీ వరకు శాస్త్రీయ నృత్య పోటలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇవి రోజు సాయంత్రం 5 నుండి రాత్రి 10 గంటల వరకు జరుగనున్నట్టు పేర్కొన్నారు. 4వ తేదీన క్లాసికల్, సెమి క్లాసికల్ నృత్యాలు, 5వ తేదీన వెస్టన్ ఫోక్ డ్యాన్స్ పోటీలు ఉంటాయన్నారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. పోటల్లో పాల్గొనే వారు సమయపాలనతో పాటు ఎవరి పాట వారే తీసుకొని రావాలి. పాట సమయంలో 4 నిమిషాలు మంచరాదు. పాల్గొనేవారు సాంప్రదాయ దుస్తులు ధరించాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 73822 04030, 99123 16841, 79979 03637లకు సంప్రదించాలని సూచించారు.



సీతారాముల ఆలయం

# ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. ఆఖరి రోజున కేంద్రాల వద్ద విద్యార్థులు సందడిగా కనిపించారు. గత నెల 21 నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. ఈ సందర్భంగా పరీక్షా అనంతరం కేంద్రాల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా బయటికి వచ్చారు. తమ స్నేహితులతో సందడిగా గడిపారు.



పరీక్ష కేంద్రం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థినులు



పరీక్షలు రాసి ఉత్సాహంగా బయటకు వస్తున్న విద్యార్థులు





పరీక్ష బాగా రాశావని చెబుతున్న విద్యార్థిని



ఒకరినొకరు హాల్ టికెట్ నెంబర్లు రాసుకుంటున్న విద్యార్థులు




పరీక్షలు రాసి ఉత్సాహంగా బయటకు వస్తున్న విద్యార్థినులు



ఆల్ ది బెస్ట్ చెప్పుకుంటున్న విద్యార్థినులు


ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.0, కనిష్ఠం 25.2
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
గురువారం 3 ఏప్రిల్ 2025





ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన సీసీఐ సాధన కమిటీ సభ్యులు

# నీటి అంచనాలు.. తారుమారు



- జిల్లాలోని ప్రాజెక్టుల్లో భారీగా తగ్గిపోతున్న నీటి నిల్వలు
- సాత్నాల ప్రాజెక్టులో 20 శాతం.. మత్తడివాగులో 17.7 శాతం పూడిక
- ఎగువ ప్రాంతంలో కనిపించని షిల్ట్ అరెస్టు ట్యాంకులు
- ఏళ్ల తరబడి పూడిక అంచనాలతోనే సరిపెడుతున్న అధికారులు
- వేసవి ప్రారంభంలోనే అడుగంటుకపోతున్న ప్రాజెక్టులు



అడుగంటిన మత్తడివాగు ప్రాజెక్టు



సాత్నాల ప్రాజెక్టు

ఆదిలాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాత్నాల, మత్తడి వాగు ప్రాజెక్టుల్లో పూడిక మట్టి భారీగా చేరి ప్రమాదకరంగా మారాయి. ప్రతీ యేటా నీటి సామర్థ్యం నిల్వ పడిపోతోంది. దీంతో నీటి నిల్వల అంచనాలు తారుమారవుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో వరద నీటిని దిగువకు వదిలేసేందుకు ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. అధికారుల అంచనాలు సరిగా లేకపోవడంతో ఆయకట్టు సాగు నిర్ణయం లెక్క తప్పుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. 1986లో సాత్నాల ప్రాజెక్టు పనులు పూర్తయిన.. 1996 నుంచి సాగునీటి కాలువలకు అధికారికంగా నీటిని వదులుతున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆదిలాబాద్, జైనథ్, బేల మండలాల్లో కుడి కాల్వ ద్వారా 20650 ఎకరాలు, అలాగే ఎడమ కాల్వ ద్వారా 3350 ఎకరాలు.. మొత్తం 24వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీటిని అందించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం 8వేల ఎకరాల ఆయకట్టును దాటడం లేదని అన్నదాతలు పేర్కొంటున్నారు. అలాగే మత్తడి వాగు ప్రాజెక్టు పనులు 2008లో పూర్తయ్యాయి. అప్పటి నుంచి సాగునీటి కాల్వల ద్వారా ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాల్లో 8,500 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం నాలుగు వేల ఎకరాల ఆయకట్టుకు కూడా సాగునీరు అందడం లేదని అన్నదాతలు చెబుతున్నారు. వేసవి కాలం ప్రారంభం మార్చి, ఏప్రిల్ నెలల్లోనే నీటి నిల్వలు అడుగంటుక పోవడంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ యేడు ఉమ్మడి జిల్లా పరిధిలోని కడెం ప్రాజెక్టులో పేరుక పోయిన పూడికను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అదే మాదిరిగా జిల్లాలోని సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టుల్లో పూడికమట్టిని తొలగించాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### పూడిక పెరగడంతో నీటి నిల్వలు పడిపోతున్నాయి

**: శ్రీనివాస్ రావు, ఇరిగేషన్ డీఈ, ఆదిలాబాద్**

జిల్లాలోని సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టుల్లో పూడిక భారీగా పెరిగి పోవడంతో నీటి నిల్వ సామర్థ్యం పడిపోతోంది. దీంతో యాసంగిలో నెల రోజుల ముందే ఆయకట్టుకు సాగునీటిని నిలిపి వేయాల్సి వస్తుంది. ప్రాజెక్టుల్లో పేరుకుపోయిన పూడికపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. వానాకాలం సీజన్‌లో తలెత్తే సమస్యలను అధిగమించేందుకు మరమ్మతులను చేపడుతున్నాం.

### వేసవి ప్రారంభంలోనే డెడ్‌స్టోరేజీకి..

సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టుల్లో చేరిన పూడిక మట్టిపై గతంలోనే అధికారులు సర్వేను చేపట్టినా.. పూడికను తొలగించేందుకు చర్యలు చేపట్టడం లేదు. సాత్నాల ప్రాజెక్టులో 1986 నుంచి అధికారికంగా పూడిక మట్టిని తొలగించిన దాఖలాలు లేవని తెలుస్తుంది. అలాగే మత్తడివాగు ప్రాజెక్టులో 2008 నుంచి పూడిక మట్టిని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నట్లు కనిపించ లేదు. దీంతో సాత్నాల ప్రాజెక్టులో 20 శాతం మేర పూడికమట్టి పేరుక పోయినట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే మత్తడివాగు ప్రాజెక్టులో 17.7 శాతం పూడిక చేరినట్లు గుర్తించారు. సాత్నాల ప్రాజెక్టు మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 1.24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.24 టీఎంసీల మేరకు పూడిక చేరినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే మత్తడివాగు పూర్తి నీటి సామర్థ్యం 0.571 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ఒక్క టీఎంసీ మేర పూడిక మట్టి చేరినట్లు అధికారుల సర్వేలో తేలింది. ప్రస్తుతం సాత్నాల ప్రాజెక్టు నీటి నిల్వ 279.80 మీటర్లకు

(తరువాయి 6వ పేజీలో...)



## సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణపై కేంద్రం సానుకూలం

- ఆరు నెలల గడువు కోరిన కేంద్ర మంత్రి
- సీసీఐ సాధన కమిటీ వెల్లడి

ఆదిలాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్, కోకన్వీనర్ ఇజ్జగిరి నారాయణలు తెలిపారు. బుధవారం ఢిల్లీకి వెళ్లిన సీసీఐ సాధన కమిటీ కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సీసీఐ పరిశ్రమపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణకు ఆరు నెలల గడువు కోరినట్లు పేర్కొన్నారు. త్వరలోనే సీసీఐ పరిశ్రమను ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వానికి అనేకసార్లు విన్నవించడం జరిగిందన్నారు. అప్పటి సీఎం కేసీఆర్ తెలంగాణ పరిశ్రమల మాజీ మంత్రులు కేటీఆర్, జోగు రామన్న అనేకసార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రిని కలవడం జరిగిందని గుర్తు చేశారు. ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణ జిల్లా ప్రజల చిరకాల స్వప్నమన్నారు. 2018 ఎన్నికల్లో బీజేపీ నేతలు అమిత్‌షా, మోదీ, హన్సరాజ్ గంగారాం పరిశ్రమ పునరుద్ధరణపై హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, రాజ్యసభ సభ్యుడు సురేష్‌రెడ్డి, వద్దిరాజు రవి, చంద్ర, దామోదరరావు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, సీసీఐ సాధన కమిటీ సభ్యులు అరుణ్‌కుమార్, గుడిపల్లి నగేష్, లోకారి పోశెట్టి, కొండరమేష్, బామన్‌జగన్, సిర్ర దేవేందర్, వెంకటనారాయణ, బొజ్జఆశన్న, దర్శనాల నగేష్, మనోజ్, తదితులు పాల్గొన్నారు.

## 'అతివలకు అండగా ఆదిలాబాద్ షీ టీం'

ఆదిలాబాద్ రూరల్/ మావల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఎలాంటి సమస్యలున్న ఆదిలాబాద్ షీ టీం బృందాలను సంప్రదించాలి అని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. అతివలకు అండగా ఆదిలాబాద్ షీటీం బృందాలు 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు. ఉద్యోగ స్థలాల్లో, కళాశాలలో ఎలాంటి సమస్యలున్న వేధింపులు ఉన్న షీ టీం బృందాలను బృందాలను సంప్రదించాలని సూచించారు. షీ టీం సంప్రదించడానికి 24 గంటలు పని చేసేలా ఫోన్ నెం. 8712659953ను ఏర్పాటు చేశామన్నారు.

## గిరిజన విద్యార్థులకు సదావకాశం

- ఉచితంగా ఇంటర్ ఐఐటీ, జేఈఈ శిక్షణ : పీవో

ఉట్నూర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులంలో ప్రస్తుతం పదవ తరగతి పరీక్ష రాసిన విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరంలో కార్పొరేట్ కళాశాలలో ఉచితంగా ఇంటర్ ఎంపీసీతో పాటు ఐఐటీ, జేఈఈ శిక్షణ కార్యక్రమాన్ని కల్పించాలని భావించినట్లు ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఆసక్తి అర్హత కలిగిన గిరిజన విద్యార్థులు తమ పాఠశాల ప్రధానోపాధ్యాయుల నుంచి దరఖాస్తు ఫారంను తీసుకొని పూర్తిచేసి ఈనెల 4న సాయంత్రం 5గంటల వరకు ఉట్నూర్‌లోని గిరిజన సంక్షేమ శాఖ డీడీ కార్యాలయంలో/ అకాడమిక్ మానిటరింగ్ పీఎంఆర్సీ, కేబీ కాంప్లెక్స్ ఉట్నూర్ అండ్ ఐటీడీఏలోని గిరిజన శిక్షణ ఉపాధి కేంద్రం కార్యాలయంలో సమర్పించాలన్నారు. 6న ప్రవేశ పరీక్షకు అనుమతి కార్డు అందజేస్తారని తెలిపారు. విద్యార్థులకు గణితం, భౌతిక మరియు రసాయన శాస్త్రం సబ్జెక్టులతో కూడిన ప్రవేశ పరీక్ష ఈనెల 8న ఉట్నూర్‌లోని కొమురంభీం ప్రాంగణంలో నిర్వహించనున్నామని పీవో పేర్కొన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

ఇచ్చోడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ చుట్టు పక్క మండలాల విద్యార్థులు ఇచ్చోడలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కలెక్టర్ రాజార్షి షా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో డిగ్రీ కళాశాల గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి అనుభవజ్ఞులైన అధ్యాపకుల సేవలను, ఇతర సౌకర్యాలను వినియోగించుకోవాలని అన్నారు. ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు వివిధ పోటీ పరీక్షలకు శిక్షణలు ఇస్తున్నారన్నారు ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ డా.సంగీత, ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్, ఇచ్చోడ ప్రిన్సిపాల్ డా॥శ్రీనివాస్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రఘు, తదితరులు పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి : మండల రైతులు

ఇచ్చోడ/ బజార్‌హత్నూర్ 2(ఆంధ్రజ్యోతి): బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మండల రైతులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోతే రైతులందరం కలిసి ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని స్పష్టం చేశారు. ఇందులో చట్ల వినిల్, నర్సయ్య, విఠల్, శంకర్, వెంకన్న, వినాయక్, పాండు, శివుడు, దాదాపు వంద మంది రైతులు పాల్గొన్నారు.

## సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు

సోనాల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణ వేడుకలకు సోనాల మండల కేంద్రంలోని రామాలయం ముస్తాబయ్యింది. ఆదివారం జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఆలయం వద్ద నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కల్యాణాన్ని కన్నుల పండువగా చేయనున్నట్లు, భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## 9న రాంజీగోండు వర్ధంతి : సభ చైర్మన్

ఉట్నూర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రాంజీగోండు నగర్‌లో ఈ నెల 9న నిర్వహించనున్న ఆదివాసీ అమరవీరుల రాంజీగోండు వర్ధంతిని విజయవంతం చేయాలని రాంజీగోండు వర్ధంతి సభ చైర్మన్ మరసుకోల తిరుపతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్రిటీష్ సైనికులపై పోరాడి రాంజీగోండు వీర మరణం పొందారని తెలిపారు.



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

## సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాజార్షిషా హాజరై సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ అడుగు జాడల్లో నడుస్తూ ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, బీసీ వెల్ఫేర్ అధికారి రాజలింగం, బీసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ దుకాణాల వద్ద ప్రధాని ఫొటో పెట్టాలి : బీజేపీ

గుడిహత్నూర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల వద్ద ప్రధాని నరేంద్రమోదీ ఫొటో ఉన్న ఫ్లెక్సీలను రేషన్ డీలర్లు ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ఉచితంగా రేషన్ అందిస్తోందని, అలాంటిది ప్రధాని మోదీ ఫొటో పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన అడ్డంకి ఏంటని ప్రశ్నించారు. గత ఎన్నికల హామీల్లో భాగంగా మరో ఐదేళ్ల దేశంలో నిరుపేదలకు ఉచిత రేషన్ బియ్యం కేంద్ర సర్కారు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా అధికార ప్రతినిధి కేంద్రే లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

**ఉట్నూర్:** కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బియ్యంతో రాష్ట్ర ప్రభుత్వం బడాయి చూపుతుందని, అన్ని రేషన్‌షాపుల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫోటోలు పెట్టాలని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్‌రితేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఒకటో నెంబర్‌షాపులో సన్న బియ్యం పంపిణీ చేపట్టిన సందర్భంగా అక్కడ ప్రధానమంత్రి ఫొటో ఉండడం చూసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టకుండానే సన్నబియ్యం పంపిణీ చేశారు. అనంతరం ఈ సందర్భంగా మాట్లాడారు. ఇందులో జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, బింగి వెంకటేశ్, సాడిగి రాజేశ్వర్, కైలాస్, శ్రీకాంత్, ఉరగొండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో సన్న బియ్యం పంపిణీ

- తాంసి, తలమడుగు మండలాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా



హస్నాపూర్‌లో సన్న బియ్యం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్



సుంకిడిలో లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తూ..

తాంసి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతం కావాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా అన్నారు. బుధవారం మండలంలోని హస్నాపూర్ గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం కొనసాగాలన్నారు. ఆయా గ్రామాలలోని రేషన్ డీలర్లు లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పంపిణీ చేయాలని సూచించారు. ప్రతీనెల 15వ తేదీలోగా వీటి పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఏఒక్క లబ్ధిదారులు కూడా సన్న బియ్యం రాలేదన్న విషయాన్ని తెలిపితే కనుక కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హస్నాపూర్ గ్రామం పైలట్ గ్రామంగా ఎంపిక కావడం ప్రతి ఒక్కరికి ప్రభుత్వం చేపట్టే పథకాలలో అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా బియ్యాన్ని కలెక్టర్ పంపిణీ చేశారు.



- ఉట్నూర్ మండలంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్

### తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి సన్న బియ్యం

**తలమడుగు:** తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతీ లబ్ధిదారునికి ప్రభుత్వం ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం మండలంలోని సుంకిడిలో రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి సన్న బియ్యం పంపిణీ చేయాలని ఉద్దేశంతో ఉగాది కానుకగా పంపిణీని ప్రారంభించిందని అన్నారు. కాగా, సుంకిడిలో వ్యవసాయ మార్కెట్ చాలా రోజుల నుంచి పెండింగ్‌లో ఉందని, మూడు మండలాల రైతులకు మార్కెట్ అందుబాటులోకి వస్తే రైతులు దూర భారం తగ్గుతుందని, మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్ తెలుపగా.. ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇందులో డిప్యూటీ కలెక్టర్ శ్యామల దేవి, జిల్లా సివిల్ సప్లై అధికారి మహమ్మద్ వజీద్, డీఎంవో సుధా, తహ సీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల నుంచి త్వరగా అమలు చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. మండలంలోని బరంపూర్ రేషన్ దుకాణంలో సన్నం బియ్యం పంపిణీని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఇందులో డీఎస్‌వో మహమ్మద్ వజిద్, తహసీల్దార్ రాజ మోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తోట వెంకటేష్, తదితరులున్నారు.

### పరిశీలించిన సబ్ కలెక్టర్

**ఉట్నూర్:** ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ బుధవారం సన్నబియ్యం పంపిణీ నిర్వహించారు. అదేకాకుండా రేషన్‌షాపుల ద్వారా అమలు చేస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాలను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ ఏ విధంగా చేపడుతున్నారో తెలుసుకోవడానికి ఉట్నూర్ మండలంలోని దంతనపల్లి, చెక్‌పోస్టు కొత్తగూడ, పులిమడుగు, సాకేర గ్రామాలలో ఉన్న రేషన్ డీలర్ షాపులను సందర్శించి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాలను నిషితంగా పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ జాదవ్‌అమృతలాల్, గిర్దావర్ అనిత ఉన్నారు.

**గుడిహత్నూర్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత సన్న బియ్యం పథకాన్ని బుధవారం మండల కేంద్రంలోని డీఆర్ డిపోలో మాజీ జడ్పీటీసీ పతంగే బ్రహ్మనంద్, తహసీల్దార్ కవిత రెడ్డి,కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించి లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఇందులో ఏఐసీసీ సభ్యుడు నరేష్ జాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆడే శీల, తదితరులున్నారు.రు.

**భీంపూర్:** సన్న బియ్యాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నలంద ప్రియ అన్నారు. ఆమె బుధవారం మండలంలోని పిప్పల్ కోటి రేషన్ షాప్‌లో సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఇందులో దాసరి రమేష్, కేమ గంగయ్య, షేక్ ఆఫ్రోజ్, షేక్ నసీరుద్దీన్, మస్కురి హన్మాండ్లు, సోమ రామ్ చందర్, రేషన్ డీలర్ గడ్డం స్వామి, తదితరులు ఉన్నారు.



కేంద్ర రక్షణ శాఖ విడుదల చేసిన లేఖ

## ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు లైన్ క్లియర్

- రాష్ట్ర ప్రభుత్వ లేఖకు స్పందించిన రక్షణ శాఖ
- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం
- ఎయిర్ పోర్టు పై జిల్లా వాసుల్లో చిగురిస్తున్న ఆశలు

వివరాలు 6వ పేజీలో...

## ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు



- ఆదిలాబాద్‌లో పరీక్ష రాసి పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

7లో

## ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

నేరడిగొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సోనాల మండలం ఘనపూర్‌కు చెందిన కృష్ణ మాహరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని వాగ్దేవి గ్రామంలో గల జగదంబ దేవి ఆలయ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం, మాంసానికి యువత బానిస కావొద్దని, అలాగే చెడు వ్యసనాల బారిన పడిన వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని అన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఇందులో జాదవ్ కృష్ణ ఆలయ పూజారి రామారావు, రోహిదాస్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.